క్లుప్తంగా

22న సెలవు ప్రకటించాలి

ఒంగోలు: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించిన అనంతరం వారు మీడియాకు వివరాలను వెల్లడించారు. లైవ్ ప్రోగ్రాం చూసే అవకాశాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోల్పోతున్నారని, కనుక సెలవు ప్రకటించాలని కోరామన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ వినతిపత్రం అందించామన్నారు.

కులగణన ప్రారంభం



గమళ్ళపాలెంలో కులగణన ప్రారంభిస్తున్న బాలాజీ

గమళ్ళపాలెం (కొత్తపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను మండలంలో గమళ్ళపాలెం గ్రామ సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శి వాయల బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఒక్కో ఇంటికి వెళ్లి వారి వివరాలను వలంటీర్లకు ఇచ్చిన స్మార్ట్ ఫోన్‌లో నమోదు చేశారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ కులగణన చేయటానికి ఇంటి దగ్గర యజమాని అందుబాటులో ఉండాలన్నారు. వలంటీర్లు సచివాలయం సిబ్బందికి సహకరించాలని అప్పుడే కుటుంబ పూర్తి సమాచారం వస్తుందన్నారు. డిజిటల్ అసిస్టెంట్ కె.వెంకయ్య, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆశ్రమానికి 10 ఫ్యాన్‌లు అందజేత



ఆశ్రమానికి ఫ్యాన్‌లను అందిస్తున్న శ్రీలేఖ

చీమకుర్తి: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డోలా శ్రీలేఖ శుక్రవారం రూ.30 వేల విలువ చేసే 10 సీలింగ్ ఫ్యాన్‌లను ఒంగోలులోని బొమ్మరిల్లు ఆశ్రమానికి అందించారు. సంతనూతలపాడు మండలం కామేపల్లివారిపాలెం గ్రామానికి చెందిన పెయింటర్ డోలా కోట్లింగం కుమార్తె శ్రీలేఖ వీటిని అందజేశారు. కార్యక్రమంలో శ్రీలేఖ తల్లిదండ్రులు కోట్లింగం, రమాదేవి, సోదరి నిఖిత, కేవీకే ప్రసాద్, ఆశ్రమం నిర్వాహకులు రాజ్యలక్ష్మి, ఖాసిం పాల్గొన్నారు.

డెమో రైళ్లను గిద్దలూరు వరకు పొడిగించాలి

గిద్దలూరు రూరల్: డెమో రైళ్లను గిద్దలూరు వరకు పొడగించాలని బీజేపీ నాయకులు రైల్వే ఎస్‌డీజీఎం అరవింద్ మల్కేడేను శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. డబ్లింగ్ రైల్వే పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు సమస్యను వివరించారు. తెనాలి నుంచి మార్కాపురం, కర్నూల్ నుంచి నంద్యాల, కడప నుంచి నంద్యాల వరకు కొనసాగుతున్న డెమో రైళ్లను గిద్దలూరు వరకు పొడిగించాలని వారు కోరారు. బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, రామాంజనేయులు, కాసులు, ఉదయ్‌శంకర్ ఉన్నారు.

జీవనోపాధి మెరుగుదలకు రుణాలు

మార్కాపురం రూరల్: మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను ఉపయోగించుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ సూచించారు. శుక్రవారం మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన రుణాలను లబ్ధిదారులకు లీడ్ బ్యాంకు మేనేజర్ అబ్దుల్ రహీమ్ ద్వారా అందజేశారు. ఈ రుణాల్లో 35 శాతం సబ్సిడీ, 10 శాతం సభ్యుల వాటా ఉంటుందని, మిగిలింది బ్యాంకు ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీజీబీ, కెనరా బ్యాంకు సిబ్బందితోపాటు వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎం సుబ్బారావు, మార్కాపురం, తర్లుపాడు ఏపీఎంలు రమేష్‌బాబు, పిచ్చయ్య, సీసీలు స్వామి, సాయిలు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు చేకూరుతున్న లబ్ధిని వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గనివానిపాడు గ్రామంలో సర్పంచ్ పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, పశువైద్యాధికారి అమూల్య, ఈఓపీఆర్డీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు తరలిన కార్యకర్తలు

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు అంబేడ్కర్‌వాదులు పలువురు విజయవాడకు వెల్లువెత్తారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న క్రమంలో ఉదయమే మండలం నుంచి నాలుగు బస్సుల్లో కార్యకర్తలు, పలువురు నాయకులు కార్లలో విజయవాడకు బయలు దేరారు. ఈ క్రమంలో అందరికీ పార్టీ నాయకులు భోజన వసతి కల్పించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు పార్టీ జండా ఊపి బస్సులను సాగనంపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, ఏపీఎం నరేంద్ర సీసీలు వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజవాడ రాము, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి నాయకులు తేళ్ల పుల్లారావు, విల్సన్, అన్వేష్, శ్రీకాంత్, మహేష్, ప్రసన్నాంజనేయరెడ్డి సింగయ్య, ఎంపీటీసీ లు పద్మ, బొమ్మల దేవదాసు, పైనం ప్రభాకర్, సర్పంచ్‌లు బొమ్మల రామాంజనేయులు, అశోక్, సంజీవరెడ్డి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈతముక్కల నుంచి విజయవాడకు బయలుదేరిన జనం

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన జనం

కొత్తపట్నం: విజయవాడలో శనివారం సాయంత్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులతో ఆవిష్కరించిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి సంఘీభావం తెలిపేందుకు మండల ప్రజలు వేలాది మంది తరలివెళ్లారు. ఈతముక్కల, మడనూరు, పాదర్తి, అల్లూరు, కొత్తపట్నం, సంకువారిగుంట, రాజుపాలెం,బీరంగుంట, వజ్జిరెడ్డిపాలెం అభిమానులు బస్సుల్లో వెళ్లారు. ముఖ్యంగా ఈతముక్కల గ్రామంలో బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి, సర్పంచ్ మేడికొండ సునీత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అన్ని గ్రామాల నుంచి బస్సుల్లో వెళ్లారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్ మైదానంలో 206 అడుగుల కాంస్య అంబేడ్కర్ విగ్రహం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయటం గొప్ప విశేషమన్నారు. అమృతి పాణి, జజ్జర సాంబయ్య, కసుకూర్తి శ్రీను, కట్టా శేఖరు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చీమకుర్తి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి విజయవాడ స్వరాజ్ మైదానానికి చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. శుక్రవారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల కన్వీనర్‌లు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు మండలాలకు చెందిన పార్టీల నాయకులు, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు బస్సులు, ప్రత్యేక వాహనాలలు విజయవాడకు తరలి వెళ్లే కార్యక్రమానికి వారు పార్టీ జెండాను ఊపి ప్రారంభించారు.



సంతనూతలపాడు నుంచి..



చీమకుర్తి నుంచి విజయవాడకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఈతముక్కలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రవీంద్రరెడ్డి, సునీత



మద్దిపాడు మండలం నుంచి సమత సంకల్ప యాత్రకు వెళ్తున్న పార్టీ శ్రేణులు

వాసవీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చీమకుర్తి: సంతనూతలపాడులో శుక్రవారం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. వాసవీక్లబ్ నూతన అధ్యక్షునిగా వేమూరి వెంకట శేషారావు, మహిళా క్లబ్ నూతన అధ్యక్షురాలిగా చలువాది చంద్రావతి, కార్యదర్శులుగా చలువాది రాము, ఎస్.జయశ్రీ, కోశాధికారులుగా సుధాకర్‌రావు, శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వరరావు, పద్మజ ప్రమాణ స్వీకారం చేశారు. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ శిద్దా సూర్యప్రకాశరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏడాదికి రూ.40 కోట్ల విలువ చేసే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వాసవీ సురక్ష పథకం కింద ఇటీవల మృతిచెందిన వేమా పాండురంగారావు, ప్రభాకర్‌రావు తరఫున వారి కుటుంబాలకు రూ.57,200, రూ.60,200 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో సిమెంట్ బల్లలు, పేద మహిళకు గ్రైండర్‌లను అందించారు. కార్యక్రమంలో చలువాది బదరీనారాయణ, నూనె వెంకట సుబ్రహ్మణ్యం, వాసవీ క్లబ్ గవర్నర్ సత్యనారాయణ, జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాద్, జీఎల్ ప్రసాదరావు, వీవీ శేషారావు స్థానికులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన వాసవీక్లబ్ నూతన కార్యవర్గం

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- మద్దిపాడు సీడీపీఓ ఇవాంజలిన్

మద్దిపాడు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మద్దిపాడు సీడీపీఓ ఇవాంజిలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థి గ్రామపరిధిలో నివాసం ఉండడంతో పాటు వివాహిత అయి ఉండాలి. అంగన్‌వాడీ ఆయా 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థిని వయసు 01/07/2023 నాటికి 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. ఎస్‌సీ, ఎస్‌టీ నోటిఫైడ్ కేంద్రాలకు దరఖాస్తు చేసుకోవడానికి వయో పరిమితి కలిగిన అభ్యర్థులు లేని క్రమంలో 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్నవారిని పరిగణలోకి తీసుకుంటారు. ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ కేటగిరీ, వికలాంగులకు కేటాయించిన పోస్టుల్లో నియామకాలకు రోస్టర్ ప్రకారం ప్రకటించిన ఖాళీల్లో సంబంధిత అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి-1 సెంటర్‌లో ఎస్‌సీ అంగన్‌వాడీ వర్కర్ 1, చీమకుర్తి మండలంలో అంగన్‌వాడీ ఆయాలు శిద్దానగర్ ఎస్‌టీ, దిన్నేపురం ఓసీ, ఇలపావులూరు బీసీ-డీ, గోనుగుంట 1 ఓసీ, కొత్త మంగలపాలెంలో బీసీ-డీ, సంతనూతలపాడు మండలంలోని కొనగానివాని పాలెంలో ఎస్‌సీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తులు సమర్పించాలి

ఒంగోలు సిటీ: ఒంగోలు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, ఆయా పోస్టులకు సంబంధించి ఈ నెల 19వ తేదీ నుంచి దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ ఫణిరాజకుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఫణిరాజకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీలు 3, ఆయా ఖాళీలు 10 ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీలకు సంబంధించి ఒంగోలు మండలంలోని మిరియాలపాలెం (జనరల్), సురేష్ మహాల్ (ఎస్సీ), కొత్తపట్నం మండలంలోని అల్లూరు-10 (జనరల్) కింద రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఆయా పోస్టులకు సంబంధించి ఒంగోలు మండలంలోని చింతలచెరువు (జనరల్), గద్దలగుంట వాటర్ ట్యాంకు (జనరల్), త్రోవగుంట-1 (ఎస్సీ), సురేష్‌మహాల్ (ఎస్సీ), రైల్‌పేట్ (జనరల్), బాలకృష్ణాపురం (జనరల్), కొండమిట్ట-3 (జనరల్), వెంగముక్కలపాలెం-2 (ఎస్సీ), యొరజర్ల-2 (ఎస్సీ), కొత్తపట్నం మండలంలోని మడనూరు-1 (బీసీ-ఏ) రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ లోపల సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పలువురు ఎస్సైల బదిలీలు

అద్దంకి రూరల్: రానున్న ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 15 మంది ఎస్సైలను ఎస్పీ వకుల్ జిందాల్ బదిలీ చేశారు. అద్దంకి నూతన ఎస్సైలుగా వేమూరు నుంచి జే. నాగరాజు, జిల్లా వీఆర్ చీరాల టూటౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న డీ. రత్నకుమారి అద్దంకి ఎస్సైలుగా నియమితులయ్యారు. అలాగే సంతమాగులూరు ఎస్సై గా పనిచేసిన ఎంవీ శివకుమార్ బాపట్ల వీఆర్‌కు వెళ్లగా అమృతలూరు పీఎస్ నుంచి పీ. సురేష్ సంతమాగులూరు నూతన ఎస్సైగా నియమించారు. మేదరమెట్ల ఎస్సై పి. నాగశివారెడ్డి బల్లికురవకు, బల్లికురవ ఎస్సై వేమన బాపట్ల వీఆర్‌కు బదిలీ అయ్యారు. కొరిశపాడు ఎస్సై జీవీ చౌదరి బాపట్ల వీఆర్ బదిలీ అయ్యారు. భట్టిప్రోలు ఎస్సై ఏ. చంద్రశేఖర్ మేదరమెట్ల ఎస్సైగా వచ్చారు

ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ బదిలీ

చీరాల: రూరల్ మండలం ఈపూరుపాలెం ఎస్సై పి.జనార్దన్‌ను కర్లపాలెం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఏడాదిన్నర క్రితం ఆయన వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడకు ఎస్సైగా వచ్చారు.

మద్యం సీసాలు పట్టివేత

చినగంజాం: అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళ వద్ద నుంచి మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మండలంలోని గొనసపూడి గ్రామంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కే సురేష్ తెలిపారు. ఆమె వద్ద ఒక్కొక్కటి రూ.200 విలువ కలిగిన ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం



ఒంగోలు రూరల్: రిబ్బన్ కట్ చేస్తున్న ఎంపీడీవో



ఒంగోలు రూరల్: మందులు అందజేస్తున్న ఎంపీడీవో, సర్పంచ్

ఒంగోలు రూరల్: సామాన్య, మధ్య తరగతి వర్గాల ఆరోగ్య సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. రూరల్‌లోని చేజర్ల సచివాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ కార్యదర్శి కె.శ్రీనివాసరావు కన్వీనర్‌గా వ్యవహరించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కరవది డాక్టర్ సుందర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి చేజర్ల, పానకాలపాలెం, ఎస్సీ కాలనీల వాసులు పాల్గొన్నారు. కరవది సీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెచ్‌వీలు మాధవి, శ్రీనివాసరావు క్యాంప్‌లో చికిత్స పొందారు. కరవది ఫార్మసిస్ట్ శ్రీధర్, ఎస్ఎన్‌లు జ్యోతి, భానుమతి మందులు ఉచితంగా అందజేశారు. డాక్టర్ మహతి, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి, సీహెచ్‌వో అశోక్‌కుమార్, స్థానిక ఏఎన్ఎం విజయలక్ష్మి, శిల్ప సేవలందించారు.

రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలి



కొత్తపట్నం: ఆడుదాం ఆంధ్రలో క్రికెట్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. ఇప్పటికే మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్, కబడీడ్డ పోటీలు ముగిశాయి. నియోజకవర్గ స్థాయికి పోటీ పడటానికి జట్లు సిద్ధంగా ఉన్నాయి. కొత్తపట్నం గ్రామంలో మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో వైఎస్సార్ క్రీడాప్రాంగణంలో శనివారం ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత క్రికెట్ ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, కబడ్డీ టీంలు నియోజక వర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీల్లో పాల్గొనడానికి పంపించామన్నారు. టీంలు విన్నర్లుగా తేల్చి నియోజకవర్గ స్థాయికి పంపిస్తామన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఏవో నరేంద్రదేవ్, పీడీ సాయి కిషోర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



విజేతగా నిలిచిన టంగుటూరు-3 కబడ్డీ మహిళా జట్టు



బాలికల క్రికెట్ జట్టును అభినందిస్తున్న ఎంపీడీఓ జలజాక్షి

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎంపీడీఓ కె.జలజాక్షి ప్రారంభించారు. కె.బిట్రగుంటలో బాలుర, బాలికల బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలికల బ్యాడ్మింటన్‌లో కె.బిట్రగుంటపై వర్ధినేనివారిపాలెం విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో కె.బిట్రగుంటపై చింతలపాలెం జట్టు విజేతగా నిలిచింది. అలాగే చిరికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికల క్రికెట్ మ్యాచ్‌లో నర్సింగోలు టీంపై చిరికూరపాడు విజేతగా నిలిచింది. విజేతలను ఎంపీడీఓ కె.జలజాక్షి అభినందించారు. కార్యక్రమంలో పీడీలు ప్రసాద్, శ్రీనివాసరావు, మురళీమోహన్, సచివాలయ కార్యదర్శులు షఫీ, కిషోర్, విద్యుల్లత పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కొణిజేడు-టంగుటూరు-3 సచివాలయాల మహిళా జట్లు కబడ్డీ మ్యాచ్‌లో తలపడగా టంగుటూరు-3 జట్టు విజేతగా నిలిచిందని ఎంఈఓ-2 బాలాజీ తెలిపారు. పీడీ అరుణ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యునాని వైద్యం వినియోగించుకోండి

గుడ్లూరు: యునాని వైద్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని యునాని వైద్యురాలు డాక్టర్ ప్రియదర్శిని అన్నారు. కొత్తపేటలో యునాని ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ ప్రియదర్శిని 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా యునాని వైద్య మందులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భారతీయ వైద్య చరిత్రలో యునాని వైద్యంకు గొప్ప విశిష్టత ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యునాని వైద్యాన్ని ప్రోత్సహిస్తూ అవసరమైన అన్ని రకాల మందులను అందిస్తోందన్నారు. వైద్య సిబ్బంది మల్లికార్జున, విజయలక్ష్మి, ప్రీతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

త్రివిక్రం శ్రీనివాస్‌పై ధ్వజం



తివిక్రం చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: మతోన్మాద, పెట్టుబడిదారుల కాపలా కుక్కగా వ్యవహరిస్తున్న సినిమా దర్శకుడు త్రివిక్రం శ్రీనివాస్ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం తీవ్రంగా మండిపడ్డారు.

ప్రపంచంలోని కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసిన మహానుభావులు కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్లకు పెట్టడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఆ సినిమా దర్శకుడు తివిక్రం చిత్రపటాన్ని ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం దగ్ధం చేశారు. రఘురాం మాట్లాడుతూ అన్ని విలువలను విడిచిపెట్టిన త్రివిక్రమ్ డబ్బు సంపాదనే ధ్యేయంగా చరిత్ర గతిని మార్చిన మహనీయులను అవమానించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. విలన్లకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను వెంటనే తొలగించాలని, లేకపోతే ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య కోరారు. గుంటూరు కారం సినిమాలో విలన్ల పేర్లను మార్చకపోతే న్యాయస్థానాన్ని సంప్రదించాల్సి వస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు హెచ్చరించారు. మార్క్స్, లెనిన్‌లు నిన్న, నేడు, రేపు కూడా మానవ జాతికి స్ఫూర్తినిస్తూనే ఉంటారని, అలాంటి మహనీయులపై బురద జల్లే కుట్రలకు పాల్పడడాన్ని ప్రజలు గుణపాఠం చెబుతారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నగర నాయకులు జి.రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరాస్వామి, విజయ్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రతి గడపకూ చేరాలి



కొండాయపాలెంలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ కృష్ణ

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలని ఈవోఆర్డీ కృష్ణ అన్నారు. శుక్రవారం పొదిలి మండలంలోని మూగచింతల, కొండాయపాలెం పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.